


# పరదేశీ కథలు
## - చిట్టే సిద్ధ లలిత



-78 -

## ఎడారిలో వెన్నెల వర్షం

**కువైట్ ఎయిర్ పోర్ట్...**

కువైట్ టు ఢిల్లీ కువైట్ ఎయిర్ వేస్ విమానం రన్ వే పై టేకాఫ్ తీసుకుంటోంది. విండో సీట్ లో కూర్చుని వున్న మల్లిక ముఖం ఆనందంతో పువ్వులా విచ్చుకుంది. తలతిప్పి మహేష్ వైపు చూసింది. ఆమెవైపే చూస్తున్న మహేష్ కళ్ళు అల్లరిగా నవ్వాయి.

"ఇది కలా నిజమా ఇంకా నమ్మలేక పోతున్నాను. విమానంలో మీ పక్కన కూర్చుని ఢిల్లీకి ప్రయాణం చేయడం నాకు నమ్మశక్యంగా లేదు. ఇలాంటి అవకాశం జీవితంలో వస్తుందనుకోలేదు మధ్యాహ్నం రెండుగంటలకల్లా మన భారతదేశ రాజధానిలో దిగుతాం" సంతోషంగా చెప్పింది మల్లిక అతని చేతిని బిగించి పట్టుకుంటూ.

"ఢిల్లీలో చూడాల్సిన ప్రదేశాలు ఎన్నో వున్నాయి. అవన్నీ నీకు చూపించాలి" చెప్పాడు చిన్నగా నవ్వుతూ.

"తాజ్ మహల్ ను చూస్తే చాలు. జన్మధన్యమవుతుంది. నన్ను ప్రేమించే వ్యక్తితో కలిసి ఆ ప్రేమ చిహ్నాన్ని చూడాలనే నా చిరకాల వాంఛ తీరుతుంది" చెప్పింది అతని కళ్ళలోకి ఆరాధనగా చూస్తూ.

"నా కోరిక కూడా అదే." చెప్పాడతను సంతోషంగా.

కువైట్ ఎయిర్వేస్ ఎయిర్ హోస్టెస్ లు అందమైన అరబిక్ అందగత్తెలు. వచ్చి చిరునవ్వుతో పలకరించి ఫుడ్ సర్వ్ చేసి వెళ్ళారు.

విమానం అరేబియా సముద్రంపైన గాల్లో ఎగురుతోంది.

మహేష్ పక్కన కూర్చున్న మల్లిక హృదయం కూడా అనిర్వచనీయమైన ఆనందంతో ఆ విమానం లాగే గాల్లో తేలిపోతోంది. మనిషికి మనిషి తోడు ఎంత భరోసానిస్తుందో. ప్రేమ జీవితంలో ఎంత ఆనందాన్నిస్తుందో అనుకుంది మల్లిక. సీటుకు జేరగిలబడి కళ్ళు మూసుకుని మహేష్ తో తన పరిచయమెలా ఏర్పడిందో

గుర్తుచేసుకోసాగింది.

అది కువైటు పట్టణం నడిబొడ్డున వున్న మాలియా సిటీలోని సూక్ అల్ వతియా ( అల్ వతియా షాపింగ్ మాల్). అరబ్ స్త్రీలకు బురఖాలు అమ్మే షాపది. మధ్యాహ్నం కస్టమర్లు లేక ఖాళీగానే వుంది.

పైన వున్న ఇంట్లోంచి కింద వున్న షాపులోకి వచ్చింది మల్లిక. ఆమె ముఖం దిగులుగా ఏడ్చినట్లుగా వుంది. కుర్చీలో కూర్చుని వున్న మామా దగ్గరికి వచ్చి "మామా నేను లక్ష రూపాయలు పెట్టి షాపులో పనికి సూనువీసా కొనుక్కుని కువైట్ కి వచ్చాను. నువ్వేమో ఇంట్లో వంటపని చెయ్యమంటున్నావు.

అప్పటికీ ఆర్నెల్లు చేసాను. ఇక ఓపిక లేదు. వంటపనికి ఎవర్నైనా తెచ్చుకుని నన్ను షాపులో పనికి పెట్టి నా జీతం పెంచండి." భయపడుతూనే గట్టిగా అడిగింది మల్లిక.

"ఎంత ధైర్యమే నీకు నా ఎదురుగా నిలబడి మాట్లాడతావా. బాబాకే ధైర్యం లేదు" అంటూ లాగిపెట్టి చెంపపైన ఒకటిచ్చింది మామా.

దెబ్బను ఊహించలేదేమో తూలిపడింది మల్లిక. అప్పటికి నాల్రోజుల్నుండీ అన్నం సరిగ్గా తినకుండా ఆలోచిస్తోందేమో లేవలేకపోయింది. అంతటితో ఆగలేదు మామా.

కాలితో మల్లికను షాపు బయటికి నెట్టి "నీకు దిక్కున్న చోట చెప్పుకో పో. నీ కొవ్వు అణగాలంటే నాల్రోజులు నీకు తిండి పెట్టకుండా బయట రోడ్డులో పడెయ్యాలి. అప్పుడు నేను చెప్పినపని చేస్తావు" అని అరిచింది కోపంగా. మామాలో అంత కోపాన్ని ఊహించలేదు మల్లిక.

అరబ్బులు అంతే. మనసు ప్రశాంతంగా వుంటే నవ్వుతూ మాట్లాడతారు. ఏదైనా చికాకులో వున్నప్పుడు కదిలించామంటే వాళ్ళ కోపం అగ్గిలా ఎగసిపడుతుంది. తరువాత తిరిగి చూడరు. తేడా వస్తే క్షమించరు. అంతపని జరుగుతుందని ఊహించలేదు మల్లిక. కాసేపు తేరుకోలేక పోయింది.

లేచి ఏడుస్తూ పక్కనే వున్న పేవ్ మెంటు మీద కూర్చుంది. సాయంత్రమయ్యింది. చీకటిపడింది. కోపం చల్లారాక మామా వచ్చి పిలుస్తుందని భావించింది. కానీ రాలేదు. రాత్రయింది. షాపులన్నీ ఒక్కొక్కటిగా మూసేసారు. వీధంతా నిర్మానుష్యంగా మారుతోంది. కాస్త భయమేసింది. దాహంగా వుంది. తాగడానికి నీళ్ళు కూడా లేవు. అందరూ షాపులు మూసుకుని వెళ్ళి పోయారు.

చీకటి పడేకొద్దీ ఎడారిచలి వంటిని పీక్కుతింటోంది. ఏమి చెయ్యాలో రాత్రికి ఎక్కడ తలదాచుకోవాలో అర్థం కాలేదు. వీధి చివర సిమెంటు బెంచి ఒకటి వుంటే దానిపైన ముడుచుకుని కూర్చుంది. ఎడారి చలి ఎముకల్లోకి దూసుకుపోతుంది. వేసవి ఎండను, శీతాకాలం చలినీ అక్కడ భరించడం కష్టం.

తెల్లారేసరికి చలికి గడ్డకట్టుకు పోవడం ఖాయం. ఒకవేళ బ్రతికినా కొంకర్లు పోయిన శరీరం తరువాత పని చేస్తుందనే నమ్మకం వుండదు. ఎడారి చలిగాలి ఈడ్చి కొడుతోంది. కాసేపటికి ఆ ప్రదేశమంతా నిర్మానుష్యమైపోయింది. పెదాలు చలికి గడ్డకట్టి పోయాయి. లోపలినుండి వణుకు పళ్ళను టకటకా కొట్టుకునేలా చేసి వింత శబ్దాన్ని వెలువరిస్తోంది. భరించడం కష్టమై పోతోంది. కాసేపటికి స్పృహ తప్పి పడిపోయేలా వుంది.

ఇక శక్తి నశించిపోయే సమయంలో దేవుడే దయతలచి దిగివచ్చినట్లు ఒక కారు వచ్చి ఆమె దగ్గర ఆగింది.

"సలామాలేకుం. సునుసొవ్వి మిన్ని. బరద్ వాజిద్. మైనూన్ ఇంతె మోత్ బర్రా" అన్నాడతను.

(ఇక్కడ ఏం చేస్తున్నావ్. చలి ఎక్కువగా వుంది. నువ్వు పిచ్చిదానివా. బయట వుంటే చచ్చిపోతావ్)

అతనికి జవాబిచ్చే స్థితిలో లేదు మల్లిక. అప్పటికే ఆమె అలసిపోయింది. ప్రాణం కాపాడుకోవడమే ముఖ్యమిపుడు.

ఒక్కుదుటున లేచి వచ్చి కారు డోరు తెరుచుకుని ముందు సీట్లో కూర్చుని "ఇక్కడనుండి తొందరగా వెళ్ళిపో. మామా చూస్తే చంపేస్తుంది" చెప్పింది బలహీనమైన స్వరంతో.

"సరే" అంటూ అతను కారును ముందుకు దూకించాడు.

కార్ లోపల హీటర్ ఆన్ చేసి వుంచడంతో వెచ్చగా వుంది.

ఆ వీధిని దాటి బయటికి వచ్చాక "ఏమైనా తింటారా?" అని అడిగాడు.

"అవును" చెప్పింది నీరసంగా.

దగ్గరలో సాండ్విచ్ షాపొకటి తెరిచి వుంటే దిగి వెళ్ళి తీసుకొచ్చాడు.

పొద్దుట్నుండీ ఏమీ తినలేదేమో తిని నీళ్ళు తాగి తెప్పరిల్లింది మల్లిక.

"ఇప్పుడు ఎక్కడికి వెళదాం" అడిగాడతను.

"ఏమో తెలియదు మామా కొట్టి బయటకు తోస్తే ఆ బెంచిపైన కూర్చున్నాను.
ఇంకాసేపైతే చలికి చచ్చిపోయేదాన్ని" ఏడ్చింది మల్లిక.

"మిమ్మల్ని రెండు మూడు నెలలనుండీ గమనిస్తున్నాను. కానీ పలకరించే ధైర్యం చెయ్యలేకపోయాను. ఇప్పుడు ఇలా బయట కనపడేసరికి ఏమైందో అని కారు ఆపాను. సరే ఏదైతే అదయ్యింది నా రూం కి తీసుకెళతాను తరువాత చూద్దాం" అన్నాడు.

మాటల్లో అతను తెలుగువాడేనని గోదావరి జిల్లానుండి కువైట్ కు వచ్చాడని పేరు మహేష్ అనీ తెలిసింది.

రెండ్రోజులకు కాస్త తేరుకుంది మల్లిక.

తన సమస్యను అతనితో పంచుకుంది.

"మామాతో నేను మాట్లాడతాను నంబరివ్వు" అని మామాకు కాల్ చేసాడు మహేష్.

మామా కోపంగా మాట్లాడింది. "దాన్ని వదిలేస్తాను. రిలీజ్ ఇచ్చేస్తాను. పాస్పోర్టు తిరిగి ఇవ్వాలంటే రెండు వందల దినార్లు చెల్లించండి" అంది.

సరేనని ఒప్పుకున్నాడతను. వెళ్ళి మామాకు డబ్బు ఇచ్చి పాస్పోర్టు తెచ్చి మల్లికకు ఇచ్చాడు. నమ్మలేకపోయింది మల్లిక. అతను తన పాలిట దేవుడిలా కనిపించాడు. వెంటనే అతడి కాళ్ళు పట్టుకుంది.

"అయ్యో అదేంపని. వద్దు. ఏదో నాకు తోచిన సహాయం చేసాను అంతే" అన్నాడతను మల్లిక భుజాలు పట్టుకుని పైకి లేపుతూ. ఆ క్షణమే మల్లిక అతనిని దేవునిలా ఆరాధించడం మొదలు పెట్టింది.

తరువాత మహేషే ఆమెకు పని కూడా చూపించాడు. ఇక ఇద్దరూ ఒకరినొకరు తెలుసుకుంటూ కలిసి జీవించడం మొదలుపెట్టారు.

అతని సమక్షంలో ఎన్నాళ్లో వేచిన ఉదయం ఎదురయినట్లు, పోగొట్టుకున్న పెన్నిధి దొరికినట్లు హాయిగా వుంది. ఇప్పటివరకూ కష్టాలు అనుభవించడమే గానీ జీవితంలో ఏ సుఖాన్నీ అనుభవించలేదు.

ఎడారిగా మారిన హృదయాల్లో ప్రేమనే వెన్నెలవర్షం కురవడం ఇప్పుడు వారి జీవితాలకు అవసరమే. తన వంటిపై భర్త పెట్టిన వాతలను, సిగరెట్ మచ్చలను చూపించి కళ్ళనీళ్ళు పెట్టుకుంది మల్లిక.

తనకు ఇష్టంలేని పెళ్ళి జరిగిందనీ, తన భార్యతో ఏ ఒక్కరోజు కూడా మనస్ఫూర్తిగా గడపలేదని జీవితం నిస్సారమై పోయిందని చెప్పి బాధపడ్డాడు మహేష్.

దేవుడే ఇద్దర్నీ ఎడారిలో కలిపాడు కాబట్టి ఇక జీవితంలోని ఆనందాన్ని కలకాలం కలిసి అనుభవించాలని నిర్ణయించుకున్నారిద్దరూ.

ఒకరోజు టివిలో తాజ్ మహల్ అనే సినిమా చూస్తూ మాటల్లో మల్లిక

"ప్రేమికునితో తాజ్ మహల్ ను చూస్తే జన్మ ధన్యమైనట్లే కదా" అంది.

ఆమె కోరికను తీర్చడమే ధ్యేయంగా భావించాడు మహేష్.

రెండేళ్ళు ఇద్దరూ కష్టపడి పని చేసుకుని సెలవుల్లో ఇండియాకు బయలుదేరారు.

ముందుగా ఢిల్లీకి వెళ్ళి అక్కడ ఆగ్రా లోని తాజ్ ను చూసి తరువాత సొంత ఊర్లకు వెళ్ళాలని ప్లాన్ చేసుకున్నారు.

మహేష్ పరిచయం, ప్రేమ, సహజీవనం, ఢిల్లీకి పయనం ఇవన్నీ మల్లికకు కలగా అనిపిస్తోంది.

విమానం డిల్లీలో దిగేటప్పటికి ఆకాశంలో మబ్బులు కమ్ముకుని సన్నటి జల్లులు కురవసాగాయి. ఎంతో ఆహ్లాదంగా అనిపించింది వాతావరణం. గాల్లో తేలివచ్చే కమ్మని మట్టి వాసనను పీలుస్తూ అబ్బ మన మట్టివాసన

ఎంతబావుందో కదా. మన నేలపై అడుగుమోపగానే ధైర్యం గుండెల నిండా నిండుకుని చెప్పలేనంత నిశ్చింతగా అనిపిస్తోంది.

పరాయిదేశం ఎన్నేళ్ళున్నా పొరుగిల్లులానే అనిపిస్తుంది కదా అంది మల్లిక చిన్నపిల్లలా వర్షపుచినుకుల్లో తడుస్తూ. స్వతహాగా మృదుస్వభావి, మితభాషి అయిన మహేష్ ఆమె మాటలు వింటూ "నా మనసులోని మాటలు నీ నోటివెంట వినడం బావుంది" అన్నాడు చిరునవ్వుతో.

హోటల్ లో రూం తీసుకుని ఆ రోజంతా ఎక్కడికీ పోకుండా కబుర్లు చెప్పుకున్నారు. పుట్టి బుద్దెరిగిన తరువాత పుట్టిన ఊరు, కువైటూ తప్ప ఇంకో ప్రదేశం చూడలేదు ఇద్దరూ. కువైట్ సంపదతో తులతూగే దేశమైనా మన పట్టణాల్లో వున్న జీవం దానికి లేదు. అంతా కృత్రిమంగా వుంటుందక్కడ చెప్పింది మల్లిక అతని పక్కన కూర్చుంటూ.

మరుసటి రోజు వెళ్ళి ఇండియా గేట్, పాలికా బజార్, ఎర్రకోట, లోటస్ టెంపుల్, కుతుబ్ మినార్ లాంటివన్నీ చూసారు. మధ్యాహ్నం లంచ్ చెయ్యాలని చూస్తుంటే కన్నాట్ ప్లేస్ లో తాజ్ మహల్ రెస్టారెంట్ కనబడింది. "మన కువైట్ లో కూడా వుందిగా ఈ రెస్టారెంటు. పద వెళదాం" అనుకుంటూ వెళ్ళి అక్కడ భోంచేసారు. సాయంత్రం వాళ్ళుంటున్న హోటల్లోని ట్రావెల్ ఏజెంట్ మరుసటి రోజుకి ఆగ్రా వెళ్ళే బస్ బుక్ చేసాడు. ఆ రాత్రి మల్లికకు మది నిండిన ఆనందంతో నిద్ర పట్టలేదు. అతనితో పరిచయం, ప్రేమ, డిల్లీకి రావడం అంతా కలలాగా వుంది. ముఖ్యంగా నిష్కల్మషమైన అతని ప్రేమ, సాహచర్యం ధైర్యాన్ని కలగజేస్తోంది. మోడుబారిన జీవితం చిగురించినట్లు, వసంతం నడిచి వచ్చినట్లు అనిపిస్తోంది. ప్రపంచ ప్రసిద్దిగాంచిన ఆ ప్రేమచిహ్నాన్ని, చారిత్రాత్మక కట్టడాన్ని చూడటానికి చాలామంది విదేశీయులు కూడా వచ్చారు. బస్సు రకరకాల మనుషులతో నిండిపోయింది. గైడు దారిపొడవునా ముఖ్యమైన ప్రదేశాలగురించి వివరించి చెపుతున్నాడు. మొదట ఆగ్రా కోటను చూసి తరువాత తాజ్ మహల్ దగ్గరికి వెళ్ళారు. తన భార్య అయిన ముంతాజ్ బేగం సమాధిని ప్రపంచానికే వింతగా మలిచి నిలిపిన షాజహాన్ ప్రేమకథ చరిత్రకెక్కింది. ఇప్పుడు ఎడారిదేశమైన కువైట్ నుండి ఇంతదూరం వచ్చి తాజ్ ను దర్శించి తమ ప్రేమను, జన్మను సాఫల్యం చేసుకోవాలనుకున్న వీరిద్దరి ప్రేమకథ కూడా గొప్పదే.

ప్రేమను పంచుకుని జన్మను సార్ధకం చేసుకునే ఇలాంటి ప్రేమికులెందరో. ప్రేమను రుచి చూడని జన్మ వ్యర్థమే కదా. లోపల వున్న ముంతాజ్, షాజహాన్ సమాధులను చూసి బయటికివచ్చి చుట్టూ పరిసరాలను గమనిస్తూ ఎడమవైపున వున్న పాలరాతి అరుగుపై కాసేపు కూర్చున్నారు. మనసంతా మౌనం నిండుకుంది. ఆనందంతో

మాటలు కరువయ్యాయి.

ఎంతో మంది జీవితంలో ఒక్కసారైనా చూడాలని కలలుగనే అద్భుతమైన కట్టడం. ప్రేమకు చిహ్నం. ఆ మహల్లోని పాలరాతి అరుగులపై కూర్చోవడంతో జన్మ ధన్యమనిపించింది. తాజ్ వెనకవైపు వున్న యమునానది బృందావన విహారి చిన్నికృష్ణుడ్ని, గోపికలను గుర్తుకు తెచ్చింది.ఎండిపోయి నీళ్ళు తక్కువున్న యమున వారివైపు బేలగా చూసింది. గతవైభవం కాలం మాటున కరిగిపోయిందా అనిపించింది.

ఇంతలో నవ్వుతూ పాంటు జేబులోనుండి చిన్న పొట్లం బయటికి తీసాడు మహేష్.

అదే సమయంలో తన బ్యాగులోనుండి చిన్న గిఫ్ట్ బ్యాగ్ ను తీసి చేతపట్టుకుంది మల్లిక.

"ఎడమచెయ్యి ఇలా ఇవ్వు" అని ఇద్దరూ ఒకేసారి అన్నారు.

ఆశ్చర్యంతో "ఏంటది" అంది మల్లిక.

ఆమె చేతిని తన చేతిలోకి తీసుకుని తను తెచ్చిన వుంగరాన్ని ఆమె వేలికి తొడిగి "ఈ తాజ్ మహల్ సాక్షిగా మన బంధం ఎప్పటికీ, ఈ జన్మలోనే కాదు వేయి జన్మలైనా సరే ఇలాగే కొనసాగాలి" చెప్పాడతను. అతని ప్రేమకు మురిసిపోయింది మల్లిక.

తను తెచ్చిన వాచ్ ని కూడా అతని చేతికి పెట్టింది.

"నాకెందుకు కొన్నావ్" అని అతడు కోపగించుకున్నాడు.

"ప్రియమైన మీకు ప్రేమతో చిరు కానుక" అడ్వెర్టైజ్ లోని ఏంకర్ లా చెప్పిందామె.

ఆమె మాటలకు నవ్వాడతను.

"నా ప్రేమికుడితో తాజ్ చూడాలని ఎప్పటినుండో అనుకుంటున్న కోరిక ఈ రోజు తీరింది. చాలా సంతోషంగా వుంది" కిలకిలా నవ్వింది మల్లిక. ఆమె నవ్వుతో యమునా నది మురిసిపోయింది. తాజ్ మహల్ సాక్షిగా ఎండిన ఎడారి హృదయాల్లో ప్రేమ పరవళ్ళు తొక్కింది. అవును ఎక్కడి గోదావరి ప్రాంతం. ఎక్కడి కువైటు.

"మనం ఆగ్రా రావడం కలగా వుంది. ఇది మన జీవితాలకు మరపురాని మధురమైన జ్ఞాపకమవ్వాలి. "

చెప్పాడు మహేష్ ఆమె చేతిని ముద్దు పెట్టుకుంటూ.

"అవును ఇకనుండీ ప్రతి సంవత్సరం సెలవులకు వచ్చినప్పుడల్లా మనం మన దేశంలోని ఒక్కో ప్రదేశాన్ని చూద్దాం. జీవితాన్ని ఎంజాయ్ చేద్దాం" చెప్పింది మల్లిక.

"తప్పకుండా చూద్దాం. షిమ్లా, కాశ్మీర్, కేరళ, ఊటీ, కొడై కెనాల్ లాంటి ఎన్నో అందమైన ప్రదేశాలున్నాయి. అన్నీ చూడాల్సిందే. నీ తోడుంటే జీవితం అర్థవంతమే. నీ చేయి పట్టుకుని ఎంత దూరమైనా ప్రయాణం చెయ్యచ్చు"

చెప్పాడతను హృదయం నిండిన ప్రేమతో.

"ఎడారిలో సంపాదనే ముఖ్యం కాదు. ఇలా సంవత్సరానికి ఒకసారైనా ఇష్టమైన ప్రదేశాలను చూసి ఆ ఆనందాన్ని, అనుభూతిని గుండెలో నింపుకోవడం కూడా జీవితానికి అవసరం చెప్పింది" మల్లిక. అతని చేతిని గట్టిగా బిగించిపట్టుకుంటూ.

తనకు ఇష్టమయిన ప్రియునితో తాజ్ మహల్ ను చూసిన తృప్తితో, సంతోషంతో ఆమె హృదయం చిందులేసింది. అతని ప్రేమ ఎడారి లాంటి ఆమె హృదయంలో వెన్నెల వర్షాన్ని కురిపించింది.

*(మరోకథ వచ్చేనెలలో)*

Post your comments